విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు :ఆదాల

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నెల్లూరు జిల్లా కీర్తి ప్రతిష్టలు పెరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరంలో ఈ నెల 29వ తేదీ నుండి రొట్టెల పండుగ జరగనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం బారా షాహీద్ దర్గా సమావేశ ప్రాంగణంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు మున్సిపల్ కమీషనర్ వికాస్ మర్మత్ తో కలసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, శాఖల వారీగా చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఎంపి మాట్లాడుతూ, అన్నీ మతాలకు,కులాలకు అతీతంగా జరగనున్న రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన ఆవసరం వుందన్నారు. రొట్టెల పండుగ ఏర్పాట్లు కు సంబంధించి ఏ శాఖకు కేటాయించిన విధులను ఆ శాఖ భాధ్యతతో, నిబద్ధతతో విధులను నిర్వర్తించి ఈ నెల 20వ తేదీ నాటికి దర్గా ప్రాంగణంలో చేపట్టాల్సిన అన్నీ ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనకు పురపాలక శాఖ అధ్వర్యంలో 2.80 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుచున్నదని, ఈ పనులన్నీ ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాలని అలాగే శానిటేషన్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్వర్ణాల చెరువు ఘాట్ ల వద్ద బారికేడ్లు, సరిపోవు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీస్ అధికారులకు సూచించారు. రెస్క్యూ టీమ్ లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. దర్గా ప్రాంతంలో, నెల్లూరు నగరంలో పండుగ రోజుల్లో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. వర్షా కాలం అయినందున వర్షం వస్తే భక్తులు ఇబ్బంది పడకుండా దర్గాకు దగ్గరలోని కళ్యాణ మండపాలను సిద్ధంగా ఉంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రొట్టెల పండుగను విజయవంతం చేసేందుకు మైనారిటీ యువకులు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి పని చేయాలని కోరారు. కార్పొరేటర్లు కూడా పండుగ ముగిసేంతవరకు ఇక్కడే ఉండి సేవ చేయాలని పేర్కొన్నారు. అవసరమైన వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి 104,108 వాహనాలతో పాటు డాక్టర్లను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. స్వర్ణాల చెరువులో నీరు సమృద్ధిగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ నెల 29వ తేదీ నుండి జరగనున్న రొట్టెల పండుగకు జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, పలు రాష్ట్రాల నుండి సుమారు 10 లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశం వుందన్నారు. అందుకను గుణంగా పురపాలక శాఖ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో 2.8 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాల కల్పనకు సంబం ధించిన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, నెల్లూరు ఆర్డీవో మలోలా, ఆర్ అండ్ బి, మునిసిపల్ శాఖ ఎస్ఈలు గంగాధర్, సంపత్ కుమార్, మత్స్యశాఖ జెడి నాగేశ్వర రావు, మున్సిపల్ హెల్త్ అధికారి డా. వెంకటరమణ, పర్యాటక శాఖాధికారి సాయి కృష్ణ, వక్ఫ్ బోర్డు చైర్మన్ మీరా, విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు వాసంతి, కార్పొరేటర్లు సత్తార్, మోబీన, పోలీసు, ఎపిఎస్ఆర్టీసి, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు,వక్ఫ్ బోర్డుసభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు వెంకయ్య సంఘీభావం

విశాలాంధ్ర- వరికుంట పాడు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువ గళం పాదయాత్రకు సంఘీభావం తెలిపి ఆయనతో కలిసి పాద యాత్ర వరికుంటపాడు మండలం మాజీ కన్వీనర్ చంద్ర వెంకయ్య నాయుడు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ విజయ దుంభిది మోగించడం ఖాయం అని అన్నారు. ఈ పాదయాత్రలో పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

21న వెంకటగిరిలో ముఖ్యమంత్రి సమావేశం

సభా ప్రాంగణ పరిశీలన-పాపకన్ను

విశాలాంధ్ర-రాపూరు:వెంకటగిరిలో ఈనెల 21 వతేది శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సభా సమావేశా ప్రాంగణంను పరిశీలించడానికి ఈ నెల 15 వతేది శనివారంవెం కటగిరి పట్టనానికి ఉదయం 11 గంలకువిచ్చేస్తున్నా ఉపముఖ్య మంత్రి నారాయణస్వామి, మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు విచ్చేస్తున్న సందర్భంగా శనివారం ఉదయం రాపూరు మండలంలోని ప్రముఖ రాజకీయ కుటుంబ సభ్యులు బాబాయి అబ్బాయి లైన మండలఎఎంసి మాజీచెర్మన్ పాప కన్ను మధుసూదన్ రెడ్డి, అబ్బాయి పాపకన్నుదయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రాపూరు మండల నాయకులు, కన్వీ నర్లు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొన వలసిందిగా కోరడమైనదని రాపూరు మండల ప్రము ఖులు,స్థానికులు వైఎస్ఆర్సిపి నాయకులు పాపకన్ను మధు సూధన రెడ్డి తెలి యజెసారు.

కల్లూరుపల్లిలో సీసీ డ్రైన్లకు ఎంపీ ఆదాల శంకుస్థాపన

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: కల్లూరు పల్లి లో శుక్రవారం 42 లక్షల రూపాయలతో నిర్మించే సీసీ డ్రైన్లకు అన్నపురెడ్డి శేఖర్, అన్నపురెడ్డి శ్రీదేవిల ఆధ్వర్యంలో నెల్లూరు ఎంపీ రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ అందరికీ లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. రెండు నెలలుగా గడపగడపకు కార్యక్రమంలో తమకు చేకూరిన లబ్ధి గురించి స్థానికులు వివరిస్తుంటే సంతోషం కలుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న డ్రెయిన్ల తోపాటు అవసరమైతే మరో 20 లక్షలు వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికే ఏడు కోట్ల రూపాయల పనులు పూర్తయ్యాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. నాడు -నేడు కింద స్కూళ్ల బాగోగులతో పాటు ఎన్నో వసతులు కల్పించి పేద విద్యార్థులకు విద్యను సులభతరం చేశారని పేర్కొన్నారు. ఆసుపత్రుల ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించి పేదల ఆరోగ్యానికి రక్షణ కల్పించారన్నారు.ఇన్ని సేవలు చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని, మమ్మల్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, స్థానిక నేతలు అన్నపురెడ్డి శేఖర్, అన్నపరెడ్డి శ్రీదేవి, కార్పొరేటర్లు గౌరీ, ఒరిస్సా శ్రీనివాసరెడ్డి మూలె విజయభాస్కర్ రెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, వైసీపీ నేతలు కోటేశ్వర్ రెడ్డి, టీవీఎస్ కమల్, హరిబాబు యాదవ్, నవీన్ కుమార్ రెడ్డి, సురేష్ రెడ్డి, సూరిబాబు, వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సిపిఎం నేతలు హైవేపై ఏర్పాటు చేస్తున్న టోల్గేట్ గురించి ప్రస్తావించగా, అటువంటిదేమీ లేకుండా చేస్తానని, ఆ ప్రయత్నాల్లోనే ఉన్నామని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి వారికి హామీ ఇచ్చారు. దాంతో వారు శాంతించి వెళ్ళిపోయారు.

ఇరుగాళ్ళమ్మ గుడిసమీపంలో బలిజ,కాపు భవన్ ప్రారంభం

విశాలాంధ్ర-రాపూరు:నెల్లూరు లోని ఇరుగాళ్ళమ్మ గుడి సమీ పంలో నూతనంగా నిర్మాణం జరిగిన బలిజ ల కాపు భవన్ ఈనెల16 వతేది ఆదివారం ఉ దయం 9 గంటలకు ప్రారంభో త్సవం నెల్లూరు జిల్లా బలిజ సంఘం ఆధ్వర్యంలో జరుగు తుందని సైదాపురం బలిజకాపు ల సంఘం నాయకులు చింతల పల్లి రవీంద్రనాథ్ తెలియజెస్తుఆదివారం జరిగే బలిజ,కాపు భవన ప్రారంభోత్సవానికి బలి జ,కాపులు తరలి వచ్చి విజ యవంతం చేయాలని ప్రకటన ద్వారా కోరారు.

పురందేశ్వరి బిజెపి బాధ్యతలు స్వీకరించడం హర్షనీయం

-విశ్వకర్మ కౌసల్య యోజన సెల్ కన్వీనర్ కుమార్

విశాలాంధ్ర-నెల్లూరు సిటీ: బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా దగ్గుబాటి పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించడం హర్షనీయమని, బిజెపి ఓబీసీ మోర్చా విశ్వకర్మ కౌసల్య యోజన సెల్ జిల్లా కన్వీనర్ ఆర్కాట్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కు బిజెపి అధ్యక్ష పదవి పురందేశ్వరికు కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం శుభ పరిణామమని అభిప్రాయం వ్యక్తం చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ లో తమ బిజెపి బలోపేతం తధ్యమని ధీమా వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచి ఐక్యతతో తాము బిజెపి బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రజల వద్ద ఎండగట్టేలా తమ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే తమ నాయకురాలి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపారు.

కందుకూరు నియోజకవర్గంలో15,16 తేదీల్లో యువగళం పాదయాత్ర

విశాలాంధ్ర-వల్లివేటిపాలెం : నారా లోకేష్ యువగళం పాదయాత్ర, కందుకూరు నియోజకవర్గంలో ఈనెల15,16 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా.ఉమ్మడి ప్రకాశం జిల్లా ముఖ్య నేతలు ఈరోజు పాదయాత్ర జరిగే ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ బిదివి శివరాంతో పాటు ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్అద్దంకి శాసనసభ్యులుగొట్టిపాటి రవికుమార్ సంతనూతలపాడు మాజీ శాసనసభ్యులు బిఎన్విజయ్ కుమార్నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలు లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

దళిత గిరిజనులకు తక్షణమే భూమి పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: అల్లూరు దళిత గిరిజనులకు తక్షణమే భూమి పంపిణీ చేయాలని వందల ఎకరాల్లో గ్రావెల్ తవ్వి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అల్లూరు తాసిల్దార్ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం అల్లూరులో గల దళిత గిరిజనులు దుర్భర పరిస్థితుల్లో జీవనం గడుపుతున్నారని జీవో నెంబర్ 54 ప్రకారం వారికి భూమి పంపిణీ చేయాలని తెలియజేశారు. జగనన్న ఆశయం దెబ్బతినకుండా అధికారులు భూమి పంపిణీ చేయాలని కోరారు. అల్లూరు మండలం ఆములూరు గ్రామంలో 363 సర్వే నెంబర్లు వందల ఎకరాల గ్రావెల్ ను తొవ్వుకొని సర్వనాశనం చేసిన సుకుమార్ రెడ్డి సురేష్ రెడ్డి, రాజుపాలెం చెందిన వైకాపా నాయకులు పై చర్యలు తీసుకోవాలని కోరారు. భూమిలేని నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలని కోరారు. అలాగే ఇసుకపల్లి గద్దగుంట గ్రామాలలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వందల ఎకరాల్లో గ్రావెల్ తోవ్వుకొని అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా గ్రావెల్ ఎత్తి సొమ్ము చేసుకుంటున్నా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మనోజు సత్యవతమ్మ జయప్రకాష్, దినేష్ ,సుసన్న, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా వాలంటీర్ల ర్యాలీ

విశాలాంధ్ర-మర్రిపాడు: ఇటీవల జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ లోని వాలెంటీర్స్ వ్యవస్థ పై చేసిన తీవ్ర కామెంట్స్ కు మనస్థాపానికి గురైన వాలంటీర్స్ శుక్రవారం మర్రిపాడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నుండి మండల బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా తరలి వచ్చి పవన్ కళ్యాణ్ పై వాలంటీర్లు విమర్శల వర్షం కురిపించారు. వాలంటీర్స్ మాట్లాడుతూప్రజా సేవ చేయాలనే ఉద్దేశం తో వాలంటీర్లు గా విధులు నిర్వహిస్తున్నామని కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించామని ఇవన్నీ పవన్ కళ్యాణ్ కు తెలియదా ని ప్రశ్నించారు.ప్యాకేజి స్టార్ గా నిలిచిన తను ఎక్కడ కష్టపడి ప్రజలకు సేవ చేసే మేమెక్కడ అంటూ పవన్ కళ్యాణ్ పై ధ్వజమెత్తారు. విధి నిర్వహణలో భాగంగాప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా మేము కృషి చేస్తుంటే జనసేన అధినేత మాపై నిందలు వేస్తూ ఆరోపణలు చేయడం తగదని చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని హితవు పలికారు.అనంతరం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీ ని వాలెంటీర్స్, వైసీపీ నాయకులు పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. ఈ నిరసన కార్యక్రమం లో కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి,ఎపిలగుంట ఎంపిటీసీ హజరత్ రెడ్డి,దుద్దుగుంట జయరామి రెడ్డి,చంద్రా నారాయణ స్వామి,ఊర్లగంటి శ్రీనివాసులు రెడ్డి,ప్రతాప్,మరియు వాలెంటీర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల కింద చేపట్టిన నూతన గ్రామ/వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణాలను ప్రభుత్వం సూచించిన నిర్ణీత గడువులోగా పూర్తిచేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె ఎస్ జవహర్ రెడ్డి శుక్రవారం ఉదయం వెలగపూడి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతి, వైద్య ఆరోగ్యశాఖ, జగనన్న విద్యా కానుక, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, నాడు నేడు, స్త్రీ, శిశు సంక్షేమ, జగనన్నకు చెబుదాం, ఆడుదాం ఆంధ్ర తదితర అంశాలపై సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా కలెక్టర్ యం. హరి నారాయణన్ పాల్గొని, జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల కింద చేపట్టిన నూతన గ్రామ/వార్డు సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వై.ఎస్.ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ల నిర్మాణాల పురోగతిని వివరిస్తూ ప్రభుత్వం సూచించిన నిర్ణీత గడువులోగా పూర్తిచేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. సిమెంట్ కొరత కారణంగా భవనాల నిర్మాణాల్లో కాస్త జాప్యం జరుగుతుందని, పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో ప్రకారం బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు చేపడుతున్నామని, గత రెండు రోజులుగా సచివాలయాలు, పాఠశాలలను తనిఖీ చేసి బడికి రాని విద్యార్థుల వివరాలను వాలంటీర్ల సర్వే ద్వారా తెలుసుకుని, వారంతా బడికి వచ్చేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. పెంచలయ్య, డిఆర్డిఎ పిడి సాంబ శివారెడ్డి, జడ్పీ సీఈవో చిరంజీవి, డిఈవో గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపిసి ఉషారాణి, సిపిఓ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం: ఎంపీడివో

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: నేడు జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని పోలినేని పాలెం గ్రామములలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీడీఓ రఫిక్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ ప్రజలు మండలస్థాయి అధికారులు అందరూ తప్పక హాజరు కావాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు.

విజయభాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: నారాయణ విద్యాసంస్థల ఏజీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం నారాయణ మెడికల్ కళాశాల లోని మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ క్యాంపు కార్యాలయంలో విజయ భాస్కర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ ఏర్పాటు చేశారు .మాజీ మంత్రి నారాయణ విజయ భాస్కర్ రెడ్డి కి కేకు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ భాస్కర్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నానన్నారు. ఆ భగవంతుని ఆశీస్సులు ఆయనకు ఎల్లప్పుడు ఉండాలని, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. నారాయణ తోపాటు ఆసుపత్రుల పరిపాలన అధికారులు మరియు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దళిత గిరిజనులకు భూమి పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-బిట్రగుంట: అల్లూరు దళిత గిరిజనులకు తక్షణమే భూమి పంపిణీ చేయాలని వందల ఎకరాల్లో గ్రావెల్ తవ్వి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు మల్లి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అల్లూరు తాసిల్దార్ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం అల్లూరులో గల దళిత గిరిజనులు దుర్భర పరిస్థితుల్లో జీవనం గడుపుతున్నారని జీవో నెంబర్ 54 ప్రకారం వారికి భూమి పంపిణీ చేయాలని తెలియజేశారు. జగనన్న ఆశయం దెబ్బతినకుండా అధికారులు భూమి పంపిణీ చేయాలని కోరారు. అల్లూరు మండలం ఆములూరు గ్రామంలో 363 సర్వే నెంబర్లు వందల ఎకరాల గ్రావెల్ ను తొవ్వుకొని సర్వనాశనం చేసిన సుకుమార్ రెడ్డి సురేష్ రెడ్డి, రాజుపాలెం చెందిన వైకాపా నాయకులు పై చర్యలు తీసుకోవాలని కోరారు. భూమిలేని నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలని కోరారు. అలాగే ఇసుకపల్లి గద్దగుంట గ్రామాలలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వందల ఎకరాల్లో గ్రావెల్ తోవ్వుకొని అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా గ్రావెల్ ఎత్తి సొమ్ము చేసుకుంటున్నా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోమనోజుసత్యవతమ్మ జయప్రకాష్, దినేష్,సుసన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపాలి

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో:సైదాపురం మండలంలోని పాఠశాలల్లో పూలే టీచర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం పిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.రత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని ఉపాధ్యాయుల చేత సభ్యత్వం నమోదు చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.రత్నం మాట్లాడుతూ ప్రభుత్వము చేస్తున్న ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు ఆపాలని, ఉపాధ్యాయుల విల్లింగ్ లేకుండా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ నుంచి గణితం కన్వర్షన్ చేయటం తగదని, ఉపాధ్యాయులకు నెలనెలా పదోన్నతులు నిర్వహించాలని, మండల విద్యాశాఖాధికారి-1 గా జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, రాష్ట్ర ట్రెజరర్ తుమ్మారవి ,జిల్లా ట్రెజరర్ బి.ప్రసాద్, మండల బాధ్యులు యం. సతీష్, యన్ వేణుగోపాల్ రావు, కె. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. సభ్యత్వం తీసుకుని సంఘ బలోపేతానికిమద్దతిచ్చిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

చంద్రయాన్ -3 ప్రయోగంవిజయవంతం

అబ్దుల్ అజీజ్ నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: శ్రీహరి కోట లోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన భారత ఇస్రో శాస్త్రవేత్తలకు అబ్దుల్ అజీజ్ అభినందనలు తెలిపారు. ఇస్రో ప్రపంచంలోనే గొప్ప అధ్యయన,ప్రయోగ కేంద్రంగా నిలుస్తున్నదని ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందిని అబ్దుల్ అజీజ్ శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడం పరిశోధన రంగం లో మరో కీలక మైలురాయని కొనియాడారు.

రేపు గౌడ విద్యార్థుల ప్రతిభ పురస్కారాల అభినందన సభ

విశాలాంధ్ర - కావలి: ప్రభుత్వ స్కూల్స్ లో 10వ తరగతి చదివి 450 కి పైగా మార్కులు సాధించిన జిల్లాలోని గౌడ విద్యార్థులకు ఈ నెల 16వ తేదిన అభినందన సభ ఏర్పాటు చేసి ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందని కావలి డివిజన్ కల్లుగీత పారిశ్రామికుల సంఘం అధ్యక్షుడు మోర్ల వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.5000 నగదు బహుమతి, నోటు పుస్తకాలు, క్యాలిక్యులేటర్, పెన్నుల కిట్టు ఇవ్వబడునన్నారు. నెల్లూరు జిల్లా గౌడ్ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ్ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపకులు దివంగత కోసూరు గోవిందయ్య గౌడ్ ప్రస్తుతం లేకపోయినా ఆయన ఆశయాలు మాత్రం కొనసాగుతున్నాయని తెలిపారు. గౌడ జాతిని విద్య వైపు నడిపించిన మహానుభావుడని, గీత కార్మికులకు ఆపద జరిగితే ఆదుకునే ఆత్మబంధువని, గౌడ్ సమస్యలపై అగ్రకులాలతో పోరాడి కల్లు సొసైటీలు నిలబెట్టిన పోరాటయోధుడని, భావితరాల గౌడ్ బిడ్డలకు బంగారు ఫలాలను అందించాలని ఓ వ్యవస్థను ఏర్పాటు చేసిన వ్యవస్థాపకులని ఆయన కొనియాడారు. అటువంటి మహానుభావుడు చేసిన మరెన్నో సామాజిక సేవలను ఈ సందర్భంగా స్మరించుకోవడం అదృష్టంగా బావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అద్దంకి శ్రీధర్ బాబు (ఐఏఎస్), ఎం.శివప్రసాద్ (ఐఎఫ్ఎస్), డాక్టర్ కట్ట రామ్మోహన్ రావు, తిరగబత్తిన శ్రీనివాసరావు గౌడ్ విచ్చేస్తున్నారని తెలిపారు. డివిజన్లోని గౌడ్ నాయకులు, గౌడ్ సోదరులు, విద్యార్థులు, గౌడ్ ఆడపడుచులు ఉదయం 9 గంటలకు సభలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వాలంటీర్ల పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

విశాలాంధ్ర-అనుమ సముద్రంపేట: రాజకీయ లబ్ధి పొందాలన్న దురుద్దేశంతో క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పని చేస్తున్న వాలంటీర్ల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భేషరతుగా వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని వాలంటీర్లు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకొ ని కేసు నమోదు చేయాలని ఎంపీపీ పద్మజా రెడ్డి తో పాటు వాలంటీర్లు పోలీసులను కోరారు . ఆమేరకు వారు ఏ ఎస్ పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు .ఇటీవల వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ కు నిరసనగా ఏ ఎస్ పేట మండల కేంద్రంలో శుక్రవారం మండలంలోని వాలంటీర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వీరి కాలేజ్ నిరసన కార్యక్రమానికి ఎంపీపీ శ్రీమతి బి పద్మజారెడ్డి ఆ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏఎస్ఐ నజీర్ కు ఫిర్యాదు చేశారు. అక్కడినుంచి స్థానిక బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేశారు. బస్టాండ్లో మానవహారం ఏర్పాటు చేసి పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఒక పార్టీకి అధినేతగా ఉండి సంస్కార రహితంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, సంస్కార రహిత రాజకీయ నాయకులకు ఎప్పుడు కూడా భవిష్యత్తు ఉండబోదని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, వేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వాలంటీర్లు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కి ఎంపికైన బాలిక

విశాలాంధ్ర-మర్రిపాడు: మర్రిపాడు మండలం కదిరి నాయుడు పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉప్పునూతల మహిమ ట్రిపుల్ ఐటీ కి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవి తెలియజేశారు.మహిమ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 576 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది.నిన్న విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఎంపిక ఫలితాల్లో ఇడుపులపాయలో సీటు సాధించింది.తమ పాఠశాల విద్యార్థిని ట్రిపుల్ ఐటీ కి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు,గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు రామిరెడ్డి ఓబుల్ రెడ్డి,శ్రీనివాసులు రెడ్డి, కేశవరెడ్డి,సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి తదితరులు విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.

నారాయణ మృతి తీరని లోటు

విశాలాంధ్ర - కావలి : ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎం.వి. నారాయణ మృతి తీరని లోటని ప్రముఖ పారిశ్రామిక వేత్త, కావ్య కృష్ణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నారాయణ నివాసానికి చేరుకొని నారాయణ పార్థీవ దేహాన్ని దర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదిగా సేవలందిస్తూ ఎందరో శిష్యులను తయారు చేసుకొని వారిని భవిష్యత్తును శిఖరాన నిలిపి నమ్మిన సిద్ధాంతాల కోసం, నమ్మిన పార్టీ కోసం చివరి వరకు నిలబడ్డారని కొనియాడారు. అనారోగ్య కారణాల రీత్యా కొద్దిరోజులుగా ఒంగోలులోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడవడం బాధాకరమన్నారు. నారాయణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

స్కూల్ హాస్టల్ తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చేర్మెన్

విశాలాంధ్ర-మర్రిపాడు: మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ వసతి గృహాన్ని ఏపీ ఫుడ్ కమిషన్ చేర్మెన్ విజయ్ ప్రతాప్ రెడ్డి శుక్రవారం తనకీ చేశారు. ముందుగా హాస్టల్ లోని స్టాక్ రూమ్ ని పరిశీలించారు. అనంతరం భోజన మెను తీరును గురించి విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు. సమయానికి అన్నీ అందుతున్నాయి అని విద్యార్థులనుండి సమాధానం రావడం తో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ కు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారని దాంట్లో భాగమే అందరితో సమానం గా విద్యార్థులు తినాలని రోజుకొక మంచి భోజన మెను ను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోని మంచి మార్కులు తీసుకొని వచ్చి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భోజన సౌకర్యంలో ఏవైనా సమస్యలు వస్తే ఫుడ్ కమిషన్ కు సమాచారం అందిస్తే విచారించి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా బాలికల వసతి గృహానికి 8నెలల నుండి వార్డెన్ లేరని ఆయన దృష్టి కి తీసుకొని రాగా అక్కడికక్కడే ఫోన్ లో డీ ఈ ఓ మాట్లాడి మరో వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా అధికారులు, మండల అధికారులు, మరియు పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం పై సమీక్షా సమావేశం

విశాలాంధ్ర-వలేటివారిపాలెం: మండలంలో త్వరలో జరగబోవు కొండ సముద్రం, సమీర్ పాలెం, పోకూరు మరియు వలేటివారి పాలెం గ్రామ సచివాలయం కు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం పై సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మరియు వలంటీర్లతో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీమతి శోభిక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో గృహసర్వే 90శాతం పూర్తి చేయాలని, సర్వే యొక్క ప్రాముఖ్యత ప్రజలకు అందరికీ తెలియజేసి వారికి అవసరమైనధ్రువ పత్రములు పూర్తిగా ఉచితంగా అందజేయబడునని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ఇందుకు భిన్నముగా ప్రవర్తించిన యెడల తగు క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డివో పద్మజ, తహసీల్దార్ సుందరమ్మ ఎంపీడీవో రఫిక్ అహ్మద్ మరియుఈవో పీ ఆర్డీ సుమంత్,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

మాదిగ ఉద్యోగుల ఆత్మీయ కలయికకు హాజరుకానున్న మందకృష్ణ మాదిగ

విశాలాంధ్ర కందుకూరు రూరల్ : ఆదివారం రోజున మందకృష్ణ మాదిగ ఉమ్మడి ప్రకాశం జిల్లా కు విచ్చేయుచున్నారని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు మాదిగ గారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు మాదిగ ఉద్యోగులు ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంద కృష్ణమాదిగ గారు రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆగస్టు నెల లో హైదరాబాద్ లోజరుగబోయే మాదిగల విశ్వరూప సభ సంభందించి భవిషత్ కార్యాచరణ రపొందించుకోవడం కోసం విచ్చేయుచున్నట్లు తెలిపారు. కావున ఉమ్మడి ప్రకాశం జిల్లా లో ఉన్న మేదావులు ఉద్యోగ పెద్దలందరూ శ్రేయోభిలాషులు అధిక సంఖ్య లో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరడమైనది.

రేషన్ కార్డుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: వైసీపీ ప్రభుత్వంలో ఒక రేషన్ కార్డు తీసుకోవాలంటే సంవత్సరం సమయం పడుతుంది.రేషన్ కార్డులు తొలగించడానికి ఒక రోజు సమయం తీసుకుంటే కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసుకుంటే సంవత్సరమైనా మంజూరు చేయని ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుంచి పనిచేయని ఆన్లైన్ బటన్ జగనన్న సురక్షలో పనిచేసింది ఇది కేవలం ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని చేస్తున్న కార్యక్రమంజగనన్న సురక్ష కేవలం వైసీపీ పార్టీ కార్యకర్తలకి పార్టీ సానుభూతిపరులకు లబ్ధి పొందారు తప్ప సామాన్య ప్రజలకి ఎటువంటి లబ్ధి జరగలేదు. రేషన్ కార్డులు సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మహాత్మా గాంధీ నగర్ సచివాలయం లో వీఆర్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ కార్యదర్శి కనపర్తి గంగాధర్ నెల్లూరు పార్లమెంట్ మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ అస్లాం 29వ డివిజన్ అధ్యక్షులు గుద్దేటి చెంచయ్య ప్రధాన కార్యదర్శి షేక్ ఖదీర్, పోలూరు సుధాకర్ సయ్యద్ ఖాదర్ పెనుబర్తి శివ సాయి, బొడ్డు బోయిన కృష్ణ , శేషు, సయ్యద్ సల్మాన్, బాల తదితర నాయకులు పాల్గొన్నారు

సీఎం జగన్ పేద ప్రజల గుండెల్లో చిరస్థానం: ఎంపీ ఆదాల

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: సీఎం జగన్ మోహన్ రెడ్డి తను చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల పేద, మధ్యతరగతి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి కొనియాడారు. 12వ డివిజన్లోని చింతా రెడ్డిపాలెంలో డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ గడపగడప కార్యక్రమంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు సాదరంగా స్వాగతం పలికి, చిరునవ్వులతో ఆహ్వానిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. మమ్మల్ని, సీఎం జగన్మోహన్ రెడ్డిని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం జగన్ చేపట్టిన కార్యక్రమాల వల్ల వైసీపీ నేతలకు, కార్యకర్తలకు ఎనలేని కీర్తి దక్కిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన కార్యక్రమాల కంటే వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి తన ఖ్యాతిని పెంచుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసరెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, మొబీనా, వైసిపి నేతలు సుబ్బారెడ్డి, పాశం శ్రీనివాసులు, హరిబాబు యాదవ్, యేసు నాయుడు, శ్రీకాంత్ రెడ్డి, రామ శివారెడ్డి, శివ సునీల్ రెడ్డి, సూరిబాబు, పుల్లారెడ్డి, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, వైసిపి సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగం చంద్రయాన్ -3 విజయవంతం హర్షనీయం

: దామ అంకయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు::శ్రీహరి కోట లోని సతీష్ధావన్అంతరిక్షకేంద్రంలోచంద్రయాన్-3 ప్రయోగాన్నిశుక్రవారంవిజయవంతంగా ప్రయోగించి విజయం సాధించినటువంటి ఇస్రో శాస్త్రవేత్తలకు సిపిఐ నెల్లూరు జిల్లా సమితి తరఫున జిల్లా కార్యదర్శి దామ అంకయ్య అభినందనలుతెలిపారు. ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడంతో ప్రపంచ పటంలో భారతదేశాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని ఈ సందర్భంగా అంకయ్య అన్నారు ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతం కావడం పరిశోధన రంగం లో మరో కీలక మైలురాయని కొనియాడారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ను కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూతన కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుతో నగర వ్యాప్తంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించడం సాధ్యమవుతుందని, పారిశుధ్య నిర్వహణ పనులను నిరంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే పర్యవేక్షించే సాంకేతికతను సెంటర్ లో ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ సెంటర్ లో నగర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణతో పాటు, నగరపాలక సంస్థ అన్ని విభాగాల సమీక్ష సమావేశాలు, మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లు, ప్రకృతి విపత్తు నిర్వహణ కేంద్రం సేవలు, స్పందన పరిష్కార వేదిక, నగరపాలక సంస్థ సమగ్ర సమాచార విభాగం వంటి వివిధ విధులను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలోఇంజనీరింగ్విభాగం అధికారులు సంజయ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాల వల్లవైసీపీ నేతలకు గౌరవం:ఆదాల

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో:సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వల్ల వైసీపీ నేతలు, కార్యకర్తలకు ఎంతో గౌరవం లభిస్తుందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 20 వ డివిజన్లోని రామకృష్ణ నగర్ లో డివిజన్ ఇంచార్జీలు ఆర్ఎస్ఆర్, సురేష్ బాబుల ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సచివాలయ పరిధిలో ఇప్పటికే 20 లక్షల రూపాయలు మంజూరు చేశామని, ఆదనంగా మరో 20 లక్షల రూపాయలు కేటాయించామని తెలిపారు. వెళ్లిన ప్రతి గడపలోనూ సంక్షేమ కార్యక్రమాల వల్ల లబ్ధి పొందడం వల్ల సాదరంగా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. కొంతమంది చిన్న చిన్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, వాటిని వెంటనే పరిష్కరించడానికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, డివిజన్ ఇంచార్జీలు అర్ ఎస్ ఆర్ , తాళ్లూరు సురేష్ బాబు కార్పొరేటర్లు అవినాష్, మూలే విజయభాస్కర్ రెడ్డి, ఒరిస్సా శ్రీనివాసరెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్ వైసీపీ నేతలు సురేష్ రెడ్డి, శివరామిరెడ్డి, పెంచల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సూరిబాబు, నరసింహారావు, టీవీఎస్ కమల్ సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, జెడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి, పెరుమాళ్ళ పద్మజా యాదవ్,పోతురాజు రమాదేవి, సరళమ్మ, ప్రసన్న దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాల శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: శుక్రవారం ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులో గల ప్రభుత్వ డైట్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ, మాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్' ల సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు 'జీవన నైపుణ్యాల'పై వృత్యంతర శిక్షణా కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నట్లు కోర్సు డైరెక్టర్ మరియు ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ తెలియజేశారు.ఈ శిక్షణలో భాగంగా 'జిల్లా సైన్స్ సెంటర్' క్యూరేటర్ యస్.సుబ్రహ్మణ్యం తాను స్వయంగా తయారుచేసిన 'మూన్ గ్లోబ్' ను ప్రిన్సిపాల్చేతులమీదుగాఆవిష్కరించారు.అనంతరం 'చంద్రయాన్' ప్రయోగం గురించి వివరించారు. ఈ శిక్షణ 3 రోజుల పాటు నాన్-రెసిడెన్షియల్ విధానంలో జరుగుతుందన్నారు.

చంద్రయాన్ -3 విజయవంతంతో షార్‌లో సంబరాలు

ఇస్రో శాస్త్రవేత్తలు భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచ పటంలో రెపరెపలాడించారు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు::చంద్రయాన్ 3 రాకెట్ ప్రయోగం భారత దేశ ఖ్యాతిని మరింత పెంచిందని, అంతరిక్ష యాత్ర లో కొత్త అధ్యాయాన్ని సృష్టించిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.తిరుపతి జిల్లాలోని శ్రీహరి కోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడుదశల్లో జరిగిన ఈ ప్రయోగంలో చంద్రయాన్ -3 రాకెట్ విజయవంతంగా నింగిలోకి ప్రొపల్షన్ మాడ్యూల్ ను ప్రవేశపెట్టింది. శ్రీహరి కోట లోని షార్ ప్రయోగ కేంద్రం నుండి మధ్యాహ్నం 2.35 నిమిషాలకు అంతరిక్షం లోకి ప్రయోగించారు.ఈ శాటిలైట్ 40రోజుల పాటు ప్రయాణించి చంద్ర మండలానికి చేరనుంది. ఆగస్టు 23 లేదా 24 తేదీల్లో ఈ శాటిలైట్ లోని రోవర్ చంద్రునిపై కాలు మోపనుంది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలకు కరతాళ ధ్వనులతో కార్యక్రమానికి హాజరైన పలువరు ,శాస్త్ర వేత్తల బృందానికి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ చంద్ర యాన్ 3 ప్రయోగం మన దేశాప్రతిష్టను మరింత పెంచిందన్నారు.ఇది చాలా సంతోషకరమైన రోజని, మన దేశం చరిత్ర సృష్టించిన రోజుగా పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనదేశం ఏ దేశానికి తీసి పోదన్నారు.దేశం గర్వించదగేలా ఇస్రో పనిచేస్తోందని, భారత అంతరిక్ష పరిశోధనలకు ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాం"న్నారు. అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ కలగన్న రోజు ఇదన్నారు. చంద్రయాన్ -3 ప్రారంభం చాలా బాగుందని ముగింపు కూడా ఇంకా బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. ఇస్రోచైర్మన్ డా.సోమ్ నాథ్ మాట్లాడుతూ చంద్రయాన్ ప్రయోగం విజయ వంతం అయిందని, అందుకు సహకరించిన శాస్త్ర వేత్తల కు, కృతజ్ఞతలు తెలిపారు.చంద్రయాన్ చంద్రుని దిశగా పయనిస్తున్నదని, క్రమంగా నిర్దేశించిన కక్ష్యలోకి చంద్రుని వైపు పయనం చేసి 42 రోజులలో దక్షిణ ధృవంలోకి ప్రవేశించ వలసి ఉందన్నారు. ఇంతవరకూ అన్నీ సవ్యంగాసాగాయన్నారు.దీనిని రికార్డ్ సమయంలో విజయ వంతంగా ప్రయోగించాం అన్నారు.ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్స్ రాజరాజన్, ఉన్నికృష్ణన్ నాయర్ ఎం.శంకరన్, వి నారాయణన్,నగేష్ దేశాయ్ మోహన్ కుమార్, వేణు ముత్తు వేల్ తదితర , శాస్త్రవేత్తలు, ఇస్రో సిబ్బంది పాల్గొన్నారు.

విద్వేషాలకు నిలయం ఆ గ్రామం

నేడు అభివృద్ధిపదాన పయనం

విశాలాంధ్ర-వరికుంటపాడు: విద్వేషాలతో విధ్వంశాలతో కక్షలతో నిత్యం గొడవలతో మండలంలో ఎప్పుడు ప్రజల నోళ్లలో నానే గ్రామం విరువూరు. వరికుంటపాడు మండలంలోనే రాజకీయంగా చైతన్యవంతమైన ఊరు విరువూరు. ఎన్నిక ఏదైనా సరే గొడవలు జరగడం ఆ ఊరు సాంప్రదాయం. కేసులు పెట్టుకోవడం వారి విధానం. కేవలం ఆ గ్రామంలోనే వందల కేసులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా ఎన్నికల్లో బెదిరింపులు దౌర్జన్యాలు రీపోలింగ్లు ఆ ఊరి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. కాలక్రమేనా వచ్చిన మార్పులు కావచ్చు చదువుకున్న యువకుల వల్ల కావచ్చు నేడు గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నది. ఎక్కడ గొడవ లు కేసులు లేకుండా ప్రశాంత జీవన విధానం మొదలైంది. ఈ మార్పులకు కారణం గ్రూపు తగాదాలకు యువకులు దూరంగా ఉండడంతో గ్రూప్ తగాదాలను పెంచి పోషించే వాళ్ళ సంఖ్య గణనీయంగా తగ్గింది. పైగా ఇంచుమించు ప్రతి కుటుంబంలో ఎవరో ఒకరు చదువుకోవడం ఉద్యోగాలు రావడం, లేదా ఏదైనా వ్యాపారం చేసుకోవడంతో ప్రస్తుతం గ్రామంలో ప్రశాంత వాతావరణం ఎలా ఉన్నది. ముఖ్యంగా ఆలేటి భాను కుమార్ తండ్రి హజరత్తయ్య ల ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో గ్రామానికి నూతన శోభన తీసుకొచ్చే విధంగా నిర్మించిన రామాలయం గొప్ప విషయంగా చెప్పుకోవచ్చు. ఆ రామాలయంతో నేడు గ్రామానికి పూర్వ వైభవం ఆధ్యాత్మిక శోభ చేకూరింది అనవచ్చు. ఇక్కడ చెప్పుకోవలసిన ఇంకో ముఖ్య విషయం పీర్ల పండగ. మామూలుగా పీర్ల పండుగను ఎక్కువ గ్రామాల్లో ముస్లిం సోదరులు నిర్వహిస్తుంటారు. కానీ విరువూరు లో తక్కువగా ఉన్న ముస్లిం కుటుంబాలతో కలిసి హిందూ కుటుంబాలు భారీగా పీర్ల పండుగను నిర్వహించడం ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.

వెంకటగిరి రాజులు నిర్మించిన కోట ప్రత్యేకతగా చెప్పవచ్చు

విరువూరు గ్రామానికి కూతవేటు దూరంలో కోట వర్ధిపల్లి లో వెంకటగిరి రాజులు, రెడ్డి రాజులు నిర్మించిన పెద్ద కోట ఉన్నది. వెంకటగిరి రాజుల హయాంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొందిన ఈ కోట చరిత్ర నేడు కాలగర్భంలో కలిసిపోయింది. ఆ ఘన చరిత్రకు ఆనవాళ్లుగా నేడు అక్కడున్న శిధిలాలను చూస్తే తెలుస్తుంది. ఈ కోట యొక్క చరిత్ర మొత్తం జడ దేవి శాసనంలో ఉన్నట్లు పూర్వీకులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలోనే అతి పెద్ద రిజర్వాయర్ నక్కల గండి ఈ ప్రాంతానికి అదనపు ఆకర్షణగా ఉన్నది. ఎన్నో రైతు కుటుంబాలకు ఆధారంగా నిలిచింది.

కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం నాయకుని దేవస్థానం

విరువురు గ్రామానికి తూర్పు వైపున తూర్పు వైపున నాయకుని దేవస్థానంగా పేరుగాంచిన అభయాంజనేయ స్వామి దేవస్థానం ఉన్నది. కొన్నేళ్లపాటు అక్కడ ధూప దీప నైవేద్యాలు కూడా లేకుండా కొనసాగుతూ వచ్చింది. ఆ అభయాంజనేయ స్వామి ఏమి తలిచాడో తెలియదు కానీ ఒక్కసారిగా స్వామికి ఎనలేని వైభవం చేకూరింది. అదే గ్రామానికి చెందిన గోను సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు దాతల సహకారంతో నేడు ఆ దేవస్థానం ధూప దీప నైవేద్యాలతో కలకలాడుతున్నది. ముఖ్యంగా ప్రతి శనివారం జరిగే అన్నదానానికి వరికుంటపాడు మండలం నుంచే కాకుండా దగ్గరలో ఉన్న పెద్ద పట్టణం పామూరు నుంచి భక్తులు వేలాదిగా హాజరవుతున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలను దేవస్థానం కమిటీ వారు ఏర్పాటు చేయగలిగారు. అన్ని సౌకర్యాలు మరియు రోడ్డు మార్గం బాగా ఉన్నందువల్ల భక్తుల తాకిడి బాగా పెరిగింది. ఈ విధంగా ప్రతి గ్రామంలో మార్పు జరిగితే అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తారని మండల ప్రజలు అంటున్నారు.

హైకోర్టున్యాయవాది నారాయణ మృతి

విశాలాంధ్ర - కావలి : సీనియర్ టీడీపీ నాయకులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది, ముప్వల వెంకట నారాయణ (71) శుక్రవారం ఉదయం 6గంటలకు ఒంగోలులోని అయన కుమార్తె ఇంట అనారోగ్యంతో తుది శ్వాశ విడిచారు. అయన భౌతిక కాయాన్ని కావలి లోని అయన స్వగృహానికి తరలించారు. యం. వి. నారాయణ కడు పేదరికం నుండి అంచె లంచెలు గా ఎదిగి, తన పుట్టిన ఊరు కావలికి, మరియు నెల్లూరు జిల్లాకి కూడా పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు యం. వి. నారాయణ లోని మంచి గుణాలను గుర్తించి, కావలి నియోజకవర్గం నుండి శాశనసభ్యులుగా పోటీ చేయించారు. అనూహ్యంగా బై ఎలక్షన్స్ లో కీ. శే.కలికి యానాదిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.నారాయణ టీడీపీ పార్టీలో ఎంతో విధేయుడిగా ఉన్నారు.ఎన్ టి ఆర్. ఆయనకు ఏ పి ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించారు. ఆ సందర్భంగా టీడీపీకి ఎనలేని సేవలు చేశారు. ఎన్.టి.ఆర్. తర్వాత ముఖ్యమంత్రి అయిననారా చంద్రబాబు నాయుడుకు కూడా సన్నిహితంగా మెలిగారు. న్యాయవాదిగా కూడా అయన టీడీపీ కి ఎన్నో సేవలు అందించారు. తన న్యాయవాద వృత్తిలో కూడా నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల మంచి పేరు, ప్రతిష్టలు గడించారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ హై కోర్టులో కూడా సీనియర్ న్యాయవాదిగా పనిచేశారు. నెల్లూరు జిల్లా కన్స్యూమర్ ఫోరమ్ మెంబరుగా పనిచేసి, ప్రజలకు తన సేవలు విరివిగా అందించారు. అయన వద్ద ఎంతో మంది న్యాయవాదులు జూనియర్ లు గా పనిచేసి ప్రస్తుతం ఉన్నత న్యాయవాదులుగా పనిచేస్తూ ఉన్నారు. వారిలో ముఖ్యము గ విశ్రాంత జడ్జి రాధమ్మ, మాజీ ఏ.జి.పి. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది పొట్లూరు శ్రీని వాసులు,కోవూరు మాజీ ఏ.జి.పి. పి. వెంకటేశ్వరు, నాగ సుబ్రహ్మణ్యం, కందుకూరు మాజీ ఏ.జి.పి. మాల్యాద్రి, లీడింగ్ అడ్వకేట్ లు పి. సునీల్ కుమార్ సింగ్, బి. వి. మధు సూదన రావు, ఇంకా ఎందరో శిష్యులు ఆయనకు ఉన్నారు. ఆయనకు భార్య ప్రముఖ న్యాయవాది సత్యవతి, కుమారులు సునీల్, రవీంద్ర (హై కోర్టు న్యాయవాది)కుమార్తెలు డాక్టర్ వసుధ, మరియు సుజనలు ఉన్నారు.కాగా యం. వి. నారాయణ భౌతిక కాయనికి శనివారం ఉదయం అంత్య క్రియలు జరుగుతాయని కుటుంభసభ్యులు తెలిపారు.

కమ్యూనిస్టు నాయకుడు

గుజ్జల ఎలమందరెడ్డి శతజయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : మాజీ పార్లమెంట్ సభ్యులు కమ్యూనిస్టు ఉద్యమ జాతీయ నేత దివంగత గుజ్జుల ఎల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని కందుకూరు నియోజకవర్గం కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. సిపిఐ కందుకూరు నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం పి బాలకోటయ్య అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా కనిగిరి తాలూకా నేరేడుపల్లె గ్రామంలో జన్మించిన గుజ్జుల ఎల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలు ప్రకాశం నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామని అన్నారు. ఎల్లమందారెడ్డి శాసనసభ్యులుగా అనంతరం పార్లమెంట్ సభ్యులుగా కొనసాగారు. ఆయన పార్లమెంట్ సభ్యులుగా ఉన్న సమయంలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం కొనసాగుతున్న తరుణంలో పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారని ఆయన గుర్తు చేశారు. ఎంతో చరిత్ర కలిగిన గుజ్జుల ఎల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు రెండు జిల్లాల్లో కమిటీల ఏర్పాటు జరిగిందని ఆయన అన్నారు. ఆగస్టు 13న ఒంగోలులో శతజయంతి ఉత్సవాలు ప్రారంభ మవుతాయని ఆయన చెప్పారు. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి గుజ్జుల ఎల్లమందారెడ్డి కుమారుడు జర్మనీలో పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగుతున్న గుజ్జుల రవీంద్ర హాజరవుతారని మాలకొండయ్య తెలిపారు. నెల్లూరు జిల్లా సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు ఆత్మకూరు లోని సోమశిల దగ్గర జరుగుతాయని నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు శాఖా కార్యదర్శులు నియోజకవర్గ సమితి సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 10వ తేదీ వరకు జరిగే బస్సు యాత్రలో పార్టీ సభ్యులు సానుభూతిపరులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సురేష్ కోరారు.

సీజనల్ వ్యాధుల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:ప్రజలు రోగాల బారిన పడకుండా సీజనల్ వ్యాధుల గురించి ప్రతి ఒక్క రికి అవగాహన కలిగి ఉండాలని మెడి కవర్ హాస్పిటల్ జనరల్ ఫిజియాన్ డాక్టర్ కె. పెంచల్ ప్రసాద్ తెలిపారు. ముఖ్యంగా శీతాకాలంలో వేసవి కాలంలో వచ్చే వ్యాధుల గురించి ఆయన వివరించారు.సీజనల్ వ్యాధులువీటిని మళ్ళ వర్షాకాల వ్యాధులు (మాన్సూన్ డిసీజెస్), చలి కాల వ్యాధులు (వింటర్ డిసెసెస్) ఎండా కాల వ్యాధులు(సమ్మర్ డిసీజెస్)గ చెప్పుకోవచ్చు.. వర్షాకాలంలో కలిగే సాధారణ ఆరోగ్య సమస్యలు : ఇవి ముఖ్యంగా జూన్ నుంచి స్టార్ట్ అయి సెప్టెంబర్ వరకు ఉన్న టైమ్ గాప్ లో వస్తాయి. ఈ కాలం లో ముఖ్యం గా మలేరియా, డెంగు ,చికెంగున్య వంటి రోగాలు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయి. ఈ సీజన్ లోనే వాటర్ బోర్న్ డిసీజెస్ కూడా ఎక్కువ వ్యాప్తి చెందే అవకాశం వుంది. వాటర్ బోర్న్ రోగాలు అయిన టైఫాయిడ్, కలరా, జియర్డియాసిస్, అమోబిక్ డైసెంటరీ , లెప్టోస్పిరోసిస్ మరియు హెపటైటిస్ ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం వుంది.

చలి కాల వ్యాధులు:

ఇవి ముఖ్యంగా కామన్ కోల్డ్, రేస్పిరేటరి సింట్రైషల్ వైరస్ ఇన్ఫెక్షన్ , ఇన్ఫ్లుఎంజా ఇన్ఫెక్షన్ , న్యూమోనియా మొదలైనవి.సమ్మర్ డిసీజెస్:ఇవి ఎక్కువగా ఎండాకాలం లో వస్తాయి. ముఖ్యంగా డిహైడ్రేషన్ , సన్ స్ట్రోక్ , హె ఫీవర్ మరియు ఫుడ్ పాయిసీనింగ్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు:. వర్షాకాల వ్యాధులు : వీటిలో ముఖ్యంగా దోమలు ద్వారా వ్యాప్తి చెందే రోగాలని మనం చాలా రకాలుగా నివారించవచ్చు. ముఖ్యంగానీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, నీటిపై ఇన్సెక్టిసైడ్ లేదా రెప్పెలెంట్ ను స్ప్రే చేయడం. ఇంకా దోమతెరలు, రేపేలెంట్ క్రీం వాడటం చేయడం ద్వారా మనం ఈ వ్యాధులను నివారించ వచ్చు..వాటర్ బోర్న్ డైసెస్ లను వాటర్ ను వడకట్టడం లేదా వాటర్ ను వేడి చేసి చల్లబరచి తాగడంలేదా వాక్సిన్ వేయించుకోవడం ద్వారా వీటిని రాకుండా నివారించు కోవచ్చు. వాటిల్లో ముఖ్యంగా హాట్ హాట్ వాటర్ ని తాగడం ఆవిరిని పట్టించడం, హీటర్స్ లేక హుమిడిఫిర్స్ వాడటం. ఇన్ఫ్లుయెన్జా మరియు నిమోకాక్కల్ వాక్సిన్ వేయించుకోవడం ద్వారా ఈ వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చు.

ఏపీటిఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర- వరికుంటపాడు: ఏపీటిఎఫ్ వరికుంటపాడు మండల శాఖ ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్ పూర్తయి నెలరోజులు దాటిన రేషనలైజేషన్ పోస్టుల్లో ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు లేని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఎం టి ఎస్ ఉపాధ్యాయులకు నేటికీ జీతాలు రాలేదని, వెంటనే వారికి జీతాలు చెల్లించాలని ఏపీ టిఎఫ్ జిల్లా కార్యదర్శి డి మాల్యాద్రి డిమాండ్ చేశారు. మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి బాలకృష్ణ యం జిలాని భాష మరియు వరికుంటపాడు మండల కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం చేపట్టారు. పదోన్నతుల్లో నిబంధనలు నిక్కచ్చిగా పాటించాలని సిపిఎస్ రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆదరణ కేంద్రం కి ఇన్వర్టర్ వితరణ

విశాలాంధ్ర-బిట్రగుంట: కావలి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ జి లక్ష్మి ప్రసూన బోగోలు మండలం ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటి ఆదరణకేంద్రం లోని అనాథల సౌకర్యార్థం 20 వేల రూపాయలు విలువ చేసే ఇన్వర్టర్ బహుకరించారు ఈ సందర్భంగా లక్ష్మి ప్రసూన మాట్లాడుతూ అనాథల కోసం తనవంతు సహాయంగా ఈరోజు ఇన్వర్టర్ అందజేశానని ఆదరణ కేంద్రం నిర్వాహకులు సింహాద్రి భవాని సేవలను ప్రసంసిస్తున్నానన్నారు ఆదరణ కేంద్రంకి తనవంతు సహకారం అందజేస్తామన్నారు ఆదరణ కేంద్రం డైరెక్టర్ సింహాద్రి భవానిలు లక్ష్మి ప్రసూన అభినందనలు తెలిపారు.

కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ

విశాలాంధ్ర-నెల్లూరు బ్యూరో: నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 24వ డివిజన్ సుందరయ్య కాలనీ జాషువా నగర్ లో డ్రైనేజీ కాలవలు సక్రమంగా లేకపోవడంతో ఎన్నో ఏళ్లగా ఎక్కడ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వీరి సమస్యలకు పరిష్కారంగా 42 లక్షల రూపాయల వ్యయంతో డ్రైనేజీ కాలవల నిర్మాణానికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. డ్రైనేజీ కాలవలు సక్రమంగా లేకపోవడం వల్ల మురుగునీరు వెళ్ళేందుకు వీలు లేక ఈ ప్రాంతంలో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువల నిర్మాణం జరిగితే ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుంది. స్థానిక నేత అన్నపురెడ్డి శేఖర్ పలుమార్లు ఈ విషయాన్ని ఎంపీ ఆదాల దృష్టికి తీసుకురావడంతో నిధులు మంజూరయ్యాయి. ఎంపీ ఆదాల మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. విద్యా, వైద్యరంగానికి వైసీపీ పెద్దపీట వేసిందన్నారు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, హరిబాబు యాదవ్, నూనె మల్లికార్జున్ యాదవ్, ఏసు నాయుడు స్థానిక కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసరెడ్డి, మొయిళ్ళ గౌరి, మూలే విజయ్ కుమార్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాలెం సుధీర్ కుమార్ రెడ్డి, అన్నపురెడ్డి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు

కావలి లో 23న ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కావలి: సంయుక్త సేవా సంస్థ అధ్వర్యంలో 5వ ఉచిత వైద్య శిబిరం 23వ తేదీ ఆదివారం శ్రీనివాస జూనియర్ కళాశాల లో నిర్వహిస్తున్నామని వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాషా తెలిపారు. శుక్రవారం కావలి పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్య శిబిరం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ యమ్ మాలకొండయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాషా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో కావలి పట్టణంలోని ప్రముఖ వైద్యులు పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200 కే అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ వైద్య శిబిరం నందు షుగర్, బిపి, రక్త శాతం, రక్త గ్రూపులు, ఇసిజి పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వ్యాధి గ్రస్తులు వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందగలరని కోరారు. ప్రతి రెండు నెలలకోసారి నాల్గవ ఆదివారం ఈ వైద్య శిబిరం శ్రీనివాస జూనియర్ కళాశాల నందు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, విశ్రాంత లెక్చరర్ యమ్ వియస్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలలో వాలంటీర్స్‌గా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర - కావలి: రెడ్ క్రాస్ ద్వారా సమాజసేవా కార్యక్రమాలలో పాల్గొనదలచిన వారు వాలంటీర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకమండలి సభ్యులు డాకారపు రవిప్రకాష్ కోరారు. శుక్రవారం ఆయన కావలి రెడ్ క్రాస్ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచన మేరకు రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఏ.శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశ్వనికుమార్ పరిడ లు పది లక్షల మంది నూతన వాలంటీర్ల నమోదు కార్యక్రమం చేపట్టారని అన్నారు. రెడ్ క్రాస్ వాలంటీర్ గా స్వచ్ఛందసేవ చేయదలచినవారు, గూగుల్ ప్లే స్టోర్ నుండి ఏపీ రెడ్ క్రాస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని అందులో తమ పేరు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. 8 నుండి 12వ తరగతి లోపు విద్యార్థులు జూనియర్ రెడ్ క్రాస్ లోను, డిగ్రీ ఆపై చదివే విద్యార్థులు యూత్ రెడ్ క్రాస్ లోను, విద్యార్థులు కాని 15 నుండి 40 సంవత్సరముల లోపు వయస్సు గలవారు రక్తదానం, విపత్తుల సమయములలో సహాయత, వైద్య శిబిరాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ప్రాధమిక చికిత్స శిక్షణ తదితర ఆసక్తి గల విభాగాలలో వాలంటీర్లుగా చేరాలని వివరించారు. ఇతర వివరాలకు రెడ్ క్రాస్ కార్యాలయం లో సంప్రదించాలని రవిప్రకాష్ కోరారు.